
ఆడబిడ్డ నిధి.. ఊసేది..?

- ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తామని చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల ఎన్నికల హామీ
- అధికారం చేపట్టి 14 నెలలు గడిచినా.. ఊసెత్తని పాలకులు
- ఆడబిడ్డ నిధి ఇవ్వాలంటే.. ఆంధ్రాను అమ్మాలని టీడీపీ మంత్రి వ్యాఖ్యలు
- మండిపడుతున్న మహిళా లోకం
- 'ఉత్తర'లో 1,44,515 మంది లబ్ధిదారుల ఎదురుచూపులు



సీతంపేట: ఎన్నికల సమయంలో అనేక హామీలిచ్చి.. ప్రజలను మభ్యపెట్టి వారి ఓట్లతో అధికారం చేజిక్కించుకుని.. అందలం ఎక్కాక మోసగించడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యని మరోసారి తేటతెల్లమైంది. 2014 ఎన్నికల్లో 600కు పైగా అమలు కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కటీ అమలు చేయని ఘనత ఆయనది. 2024 ఎన్నికల్లోనూ సూపర్ సిక్స్‌తో పాటు మరో 143 హామీలపై చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు ప్రతి సభలో ఊదరగొట్టారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు ఆడబిడ్డ నిధి పథకం కింద నెలకు రూ.1,500 చొప్పున ఏటా రూ.18 వేలు చెల్లిస్తామని హామీలు గుప్పించారు. కూటమి నాయకులు ఇంటింటా ప్రచారం చేసి, చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు సంతకాలు చేసిన బాండ్లు పంచిపెట్టారు. అధికారం చేపట్టి 14 నెలలు గడిచిపోయింది. ఈ లెక్కన ప్రతి అక్కచెల్లెమ్మకు రూ.21 వేలు బాకీ పడ్డారని, 14 నెలలు గడిచినా ఆడబిడ్డ నిధి పథకం ఊసెత్తడం లేదని స్థానిక మహిళలు మండిపడుతున్నారు.

ఆశగా ఎదురుచూస్తున్న అక్కచెల్లెమ్మలు

కూటమి ప్రభుత్వ మోసాలు, వైఫల్యాలను ఎండగడుతూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాలతో పార్టీ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన వెన్నుపోటు, యువత పోరు నిరసన కార్యక్రమాలతో చంద్రబాబు ప్రభుత్వం దిగొచ్చి తల్లికి వందనం, విద్యాదీవెన, 3 గ్యాస్ సిలెండర్లు ఇచ్చింది. నెల రోజులుగా చేపడుతున్న బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ నిరసన సభలతో ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఆడబిడ్డ నిధి ఎప్పుడు ప్రకటిస్తారా అని అక్కచెల్లెమ్మలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

అచ్చెన్నాయుడి వ్యాఖ్యలపై ఆగ్రహం

ఓటర్ జాబితా ప్రకారం ఉత్తర నియోజకవర్గంలో 18 ఏళ్లు నిండిన మహిళలు 1,44,515 మంది ఉన్నారు. ప్రతి మహిళా ఆర్థిక సాయం ఎప్పుడిస్తారా అని ఆశగా ఎదురు చూస్తున్న వేళ.. ఆడబిడ్డ నిధి ఇవ్వాలంటే ఆంధ్రాను అమ్మాలని టీడీపీ మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలపై మహిళలంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చేటప్పుడు ఆంధ్రాను అమ్మేయాలని తెలియదా అని ప్రశ్నిస్తున్నారు. 2019 నుంచి 2025 వరకు జగనన్న పాలనలో చెప్పిన దాని కంటే ఎక్కువ సంక్షేమ పథకాల లబ్ధిని క్యాలెండర్ ప్రకారం ఆడబిడ్డల బ్యాంకు ఖాతాలో జమ చేశారని గుర్తుచేసుకుంటున్నారు.



'కూటమి' ఆడబిడ్డ నిధి హామీ పత్రం

ఆడబిడ్డ నిధి ఎగ్గొట్టేందుకు కూటమి కుట్ర



అమలు కాని అబద్ధపు హామీలతో ప్రజలను మోసగించి, ఓట్లు దండుకుని కూటమి ప్రభుత్వం అధికారం చేజిక్కించుకుంది. ఏడాది వరకు ఎన్నికల హామీల గురించి ప్రస్తావన తేలేదు. సూపర్ సిక్స్ పథకాల ఊసెత్తలేదు. మా నాయకుడు వైఎస్ జగన్ ఆదేశాలతో చేపట్టిన వెన్నుపోటు, యువత పోరు కార్యక్రమాలతో కూటమి ప్రభుత్వం దిగొచ్చి తల్లికి వందనం, విద్యా కానుక వంటి పథకాలు అమలు చేసింది. ఆడబిడ్డ నిధి కింద ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తామని చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఊదరగొట్టారు. ఇప్పటివరకూ ఆ ఊసేలేదు. ఆడబిడ్డ నిధి ఇవ్వాలంటే ఆంధ్రాను అమ్మాలని టీడీపీ మంత్రి అచ్చెన్నాయుడు మాటలు వింటుంటే.. ఈ పథకం ఎగ్గొట్టడానికి కుట్ర పన్నుతున్నట్టు ఉంది. జిల్లాలోని 18 ఏళ్లు నిండిన మహిళలందరికీ ఆడబిడ్డ నిధి ఇవ్వాలి. ఎన్నికల హామీలు అమలు చేసే వరకు ప్రజల తరఫున వైఎస్సార్‌సీపీ పోరాడుతుంది.

– కె.కె.రాజు, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ

ఆడబిడ్డ నిధి ఎప్పుడిస్తారు..?



ఓట్లు అడిగేటప్పుడు ప్రతి మహిళకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1,500 చొప్పున ఇస్తామని చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు హామీలిచ్చారు. ఆ లెక్కన నాకు ఇప్పటికీ రూ.21 వేలు రావాలి. మా ఇంట్లో 18 ఏళ్లు నిండిన ఆడబిడ్డలు నలుగురున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాల కంటే నాలుగు రెట్లు ఇస్తామని ప్రచారం చేశారు. అదంతా నిజమని నమ్మి ఓట్లేసి గెలిపిస్తే ఏదీ ఇవ్వలేదు.

– మట్టా రాణి, వెంకటేశ్వర కాలనీ

ఆంధ్రాను అమ్మేయాలని అప్పుడు తెలియదా..



ఆడబిడ్డల కష్టాన్ని తీర్చడానికి ఆడబిడ్డ నిధి పథకం పెట్టామని ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. కూటమి నాయకులు ఇంటింటికీ వచ్చి ఏ పథకాలు ఇస్తామో బాండ్లు ఇచ్చారు. 14 నెలలుగా డబ్బులు ఇవ్వకుండా అందరినీ మభ్యపెట్టారు. ఆడబిడ్డ నిధి ఇవ్వాలంటే ఆంధ్రాను అమ్మేయాలంటున్నారు. ఎన్నికల సమయంలో ఈ విషయం తెలియదా అని ప్రశ్నిస్తున్నాం.

– జి.రమ, అక్కయ్యపాలెం

ఎన్నికల్లో గెలుపు కోసమే హామీలు



గత ఐదేళ్లలో జగనన్న 30కి పైగా సంక్షేమ పథకాలు అమలు చేశారు. చెప్పిన సమయం కంటే ముందుగానే మహిళల బ్యాంకు ఖాతాలో డబ్బులు జమచేశారు. కూటమి నేతలకు ప్రజలకిచ్చిన హామీలపై చిత్తశుద్ధి లేదు. ఎన్నికల్లో గెలుపు కోసమే ఎలా గైనా జగనన్నను ఓడించాలన్న పంతంతో హామీలిచ్చారే తప్ప.. అమలు చేయాలన్న ఆలోచన లేదు.

– పి.సింహాచలం, రామచంద్రానగర్

క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



కె.కె.రాజుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న చిర్ల సత్యనారాయణరెడ్డి

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం న్యూ శ్రీనివాసనగర్ కొండవాలు ప్రాంతం వైఎస్సార్‌సీపీ మేధావి వర్గం ప్రధాన కార్యదర్శి చిర్ల సత్యనారాయణరెడ్డి నేతృత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువాతో సత్కరించారు. వార్డులో జరగనున్న బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని కె.కె.రాజును కోరారు. మేధావి వర్గం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన చిర్ల సత్యనారాయణరెడ్డిని మేధావి వర్గ సభ్యులు, పార్టీ నాయకులు అభినందించారు. జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు నీలి రవి, లీగల్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి, గ్రామాధ్యక్షుడు రాయుడు రవి, జిల్లా గ్రీవెన్స్ సెల్ మెంబర్ పైల అప్పారావు, చిర్ల కృష్ణ, గండి కనకరాజు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వస్త్రాల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు వస్త్రాలు అందిస్తున్న మంచా నాగమల్లేశ్వరి

సీతంపేట: అఖిల భారత మాలమహానాడు మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మంచా నాగమల్లేశ్వరి జన్మదిన వేడుకలు శుక్రవారం అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో ఘనంగా జరిగాయి. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు తోట నగేష్, పార్టీ జిల్లా మహిళాధ్యక్షురాలు పేడాడ రమణకుమారి, సిద్ధు, మాలమహానాడు రాష్ట్ర ప్రతినిధులు హాజరై ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ నిబద్ధతతో పనిచేసే వ్యక్తి నాగమల్లేశ్వరి అని, కష్టపడి పనిచేసే వారికి తప్పక గుర్తింపు లభిస్తుందని అనడానికి ఆమె నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సేవా కార్యక్రమాల్లో భాగంగా జీవీఎంసీ పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు.

ఓఆర్ఎస్‌పై అవగాహన



విద్యార్థులకు పవర్‌పాయింట్ ద్వారా వివరిస్తున్న డాక్టర్ రవికిరణ్

సీతంపేట: అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో శుక్రవారం హెచ్ఎం జయంతి కుమారి ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.రవికిరణ్‌రెడ్డి పాఠశాలలో విద్యార్థులకు ఓఆర్ఎస్ ఎప్పుడు వాడాలి, దాని ప్రయోజనాలను పవర్‌పాయింట్ ద్వారా వివరించారు. నీళ్లవిరేచనాలు, మూత్రం సరిగా రాకపోవడం, పెదాలు, నాలుక ఎండిపోయినట్టు ఉండటం, కళ్లు పొడిబారి నీరసంగా అనిపించడం, విపరీతమైన నిశ్శత్తువ ఉన్నట్టయితే ఓఆర్ఎస్ తాగవచ్చని సూచించారు. ఇటువంటి సమయాల్లో ఓఆర్ఎస్ తాగడం వల్ల ప్రమాద శాతాన్ని 33 శాతం వరకు తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం.ఎస్.వి.విశ్వనాథం, శ్రీరామ్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్డన్ సెర్చ్‌లో 12 బైక్‌ల స్వాధీనం



కార్డన్ సెర్చ్‌లో సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ సత్యనారాయణ

తాటిచెట్లపాలెం: పోర్ట్ టౌన్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్స్ నిర్వహించారు. 45వ వార్డు కైలాసపురం ఇనార్బిట్ మాల్ వెనుక వైపు రోడ్డు, సత్యసాయినగర్ ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు చేశారు. సరైన పత్రాలు లేని 12 బైక్‌లు, స్కూటీలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. తనిఖీల్లో ఈస్ట్ సబ్ డివిజన్‌కు చెందిన 35 మంది సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ మాస పూజలు



లలితా పీఠంలో ప్రత్యేక అలంకరణలో పద్మావతి



దుర్గానగర్ ఆలయంలో అలంకరణలో దుర్గాదేవి



లలితాదేవి దర్శనానికి బారులు తీరిన భక్తులు

సీతంపేట: శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా లలితానగర్‌లోని లలితా పీఠానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారి దర్శనానికి ఉదయం, సాయంత్రం భక్తులు బారులు తీరారు. లలితా అమ్మవారికి, పద్మావతి దేవికి ఉదయం అభిషేకం జరిపారు. అనంతరం సహస్రనామార్చన, ఖడ్గమాల, త్రిశతి, అష్టోత్తర పూజలు చేశారు. సాయంత్రం కుంకుమ పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో లలితాదేవి, పద్మావతి దేవి భక్తులకు దర్శనమిచ్చారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కుంకుమ పూజలు, అభిషేకాలు

కంచరపాలెం: కంచరపాలెం, ఊర్వశి జంక్షన్, ఐటీఐ కూడలి, 104 ఏరియాల్లోని ఆలయాల్లో శ్రావణ మాస తొలి శుక్రవారం పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దుర్గానగర్ దుర్గాలయంలో, బాపూజీనగర్ మహాలక్ష్మిదేవి ఆలయంలో, పార్వతీశ్వరాలయంలో వరలక్ష్మి దేవికి ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ, సూర్యప్రకాష్ శర్మ, శ్రీనివాసశర్మ నేతృత్వంలో కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఆలయాల కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు.

పద్మావతికి ప్రత్యేక పూజలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కొలువైన పద్మావతి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటి శ్రావణ శుక్రవారం పూజల్లో భాగంగా సహస్రనామ కుంకుమార్చన, కలువ పూలతో ఆరాధన చేశారు. మంగళాశాసనం అనంతరం తీర్థప్రసాద గోష్ఠి జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బి.ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. రెండో శుక్రవారం సందర్భంగా ఆగస్టు 1న అమ్మవారికి సంపంగి పూలతో ఆరాధన, సహస్రనామ కుంకుమార్చన జరుగుతాయని ఈవో తెలిపారు.


విశాఖలో 'ఆది కర్మయోగి' శిక్షణ



ఆది కర్మయోగి శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న నాలుగు జిల్లాల అధికారులు

తాటిచెట్లపాలెం: గిరిజన ప్రాంత అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఆది కర్మయోగి కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీనిలో భాగంగా శుక్రవారం విశాఖ దొండపర్తిలోని బెస్ట్ వెస్ట్రన్ హోటల్‌లో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల అధికారులకు రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అధికారులకు క్షేత్రస్థాయిలో సమన్వయం, రాష్ట్ర స్థాయి అధికారుల విధులు, బాధ్యతలు, ఆది కర్మయోగి ప్రతిజ్ఞ, క్షేత్ర స్థాయి ప్రణాళికల గురించి శిక్షణ ఇచ్చారు. పార్వతీపురం మన్యం జిల్లా ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ అశుతోష్ శ్రీవాస్తవ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ, సంచాలకులు ఎస్.భార్గవి ఆన్‌లైన్ ద్వారా ఆది కర్మయోగి కార్యక్రమ లక్ష్యాలు, అధికారుల విధులు, బాధ్యతలు వివరించారు. 23న ప్రారంభమైన ఈ శిక్షణ శనివారం కూడా కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. దీని అనంతరం మండల స్థాయిలో 280 మంది అధికారులకు శిక్షణనిచ్చి వీరి ద్వారా 20 వేల మంది గ్రామస్థాయి అధికారులకు శిక్షణ ఇవ్వనున్నామని చెప్పారు. దీని ద్వారా వికసిత్ భారత్ 2047 లక్ష్యాలను చేరుకుంటామన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ పి.వి.ఎస్.నాయుడు, పి.మురళీధర్, డాక్టర్ ఎం.రమేష్‌బాబు, ఎస్.వై.నూరాని, కె.సురేష్‌బాబు, పి.వనజ, ఎం.ఉమాపతి, డాక్టర్ ఆర్.కృష్ణ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

విశాఖ-నౌపడ సెక్షన్‌లో డీఆర్ఎం తనిఖీలు



నౌపడ స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న డీఆర్ఎం లలిత్ బోహ్రా

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ విశాఖపట్నం–నౌపడ సెక్షన్‌లో శుక్రవారం డీఆర్ఎం లలిత్ బోహ్రా తనిఖీలు నిర్వహించారు. ఈ స్టేషన్‌ల మధ్య ఫుట్ ప్లేట్ ఇన్‌స్పెక్షన్‌ను చేశారు. ట్రాక్ పరిస్థితులు, వంతెనలు, మలుపులు, పాయింట్స్, క్రాసింగ్స్, సిగ్నలింగ్ వ్యవస్థ, ఇతర భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. నౌపడ రైల్వే స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేసి, స్టేషన్ సిబ్బంది, గ్యాంగ్‌మెన్‌లతో మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలను ఆయన విన్నారు. ట్రాలీమెన్‌ను తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రమాణాల విషయంలో రైల్వే బోర్డు ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని డీఆర్ఎం సూచించారు.

'బుద్ధునితో నా ప్రయాణం' నాటక ప్రదర్శన రేపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఎస్ఐ అధ్యక్షుడు గౌతంబాబు, సభ్యులు

సీతంపేట: బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 27న సాయంత్రం 5.30 గంటలకు రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో 'బుద్ధునితో నా ప్రయాణం' నాటక ప్రదర్శన జరుగుతుందని బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు బత్తుల గౌతంబాబు తెలిపారు. అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం కార్యక్రమ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ(హైదరాబాద్)కి చెందిన 40 మంది కళాకారులతో ఈ నాటకాన్ని ప్రదర్శిస్తారన్నారు. బుద్ధుడి జీవిత చరిత్రతోపాటు బుద్ధిజం భారతదేశానికి ఎందుకు అవసరమనే అంబేడ్కర్ ఆలోచనలను ఈ నాటకంలో చక్కగా తీర్చిదిద్దారని చెప్పారు. లతా రాజా ఫౌండేషన్ రూ.50 లక్షల ఖర్చుతో రూపొందించిన ఈ నాటకాన్ని విశాఖలో ఉచితంగా ప్రదర్శిస్తున్నట్టు తెలిపారు. దీనికి అందరూ తిలకించి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంఎస్ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు, ప్రధాన కార్యదర్శి జె.వి.ప్రభాకర్, బీఎస్ఐ ఉపాధ్యక్షురాలు బీర రత్నకుమారి, కార్యదర్శి కె.సత్యనారాయణ, బి.ఉమామహేశ్వరి, కె.వెంకటేశ్వరరావు, పి.తిరుమల కుమార్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

నమ్మకద్రోహానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు
- 44, 53 వార్డుల్లో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'



సమావేశానికి హాజరైన 44వ వార్డు మహిళలు, పార్టీ శ్రేణులు



బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కె.కె.రాజు, బాణాల, పార్టీ నాయకులు

సీతంపేట: నమ్మకద్రోహానికి ముఖ్యమంత్రి చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్ అని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు ఇప్పటికైనా అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, 44వ వార్డు కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు అధ్యక్షతన అక్కయ్యపాలెం షాదీఖానాలో శుక్రవారం జరిగిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ సభలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. ప్రజలను మభ్యపెట్టి అధికారం చేపట్టడంలో చంద్రబాబుకు 40 ఏళ్ల అనుభవం ఉందన్నారు. ప్రజలకు సూపర్ సిక్స్ హామీలు ప్రకటించి ఏడాదిన్నర గడిచినప్పటికీ ఒక్కటి కూడా పూర్తి స్థాయిలో అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. సంచలనాత్మక నిర్ణయాలతో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు.

అనంతరం 2024 ఎన్నికల ప్రచారంలో కూటమి నాయకులు ప్రజలకు ఇచ్చిన అబద్ధపు హామీలు, చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు స్క్రీన్‌పై వీడియో రూపంలో ప్రదర్శించారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కరపత్రాలు ఆవిష్కరించి, క్యూఆర్ కోడ్ స్కాన్‌చేసి చంద్రబాబు హామీలు, మోసాలను చూడాలన్నారు. బాణాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు ప్రకటించిన నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, ఇంటికీ మూడు ఉచిత గ్యాస్ సిలండర్లు అందుకున్నారా అని ప్రశ్నించగా.. రాలేదని మహిళలు సమాధానమిచ్చారు. కార్యక్రమంలో 44వ వార్డు అధ్యక్షుడు హబీబ్, యువజన విభాగం నాయకుడు బాణాల తరుణ్‌కుమార్, బి.వెంకటరావు, మహాదాస్యం గోపి, బాధ శ్రీనివాస్, పిడుగు వెంకటరమణ, కోలా వెంకట్, ముత్యాలు, ప్రకాష్, సీనియర్ నాయకులు దుప్పలపూడి శ్రీను, భోగవిల్లి గోవింద్, జక్కంపూడి సత్యనారాయణ, పద్మ శేఖర్, సూరబత్తుల తిరుపతి, బూత్ కన్వీనర్లు, బూత్ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌తోనే ప్రజలకు మేలు



53వ వార్డు సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు

మద్దిపాలెం: ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసి పరిపాలన సాగిస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు విమర్శించారు. కూటమి ప్రభుత్వం మెడలు వంచి ప్రజలకు మేలు చేయడమే జగనన్న ప్రధాన లక్ష్యమన్నారు. 53వ వార్డులోని పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్ బర్కత్ అలీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. చంద్రబాబు పాలనలో ఆడబిడ్డలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. కూటమి ప్రభుత్వం తీరును ఎండగడుతూ.. అమలు చేయని హామీలను తెరపై ప్రదర్శిస్తూ స్థానిక ప్రజలకు బాబు మోసాలను వివరించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలతో రాష్ట్రంలో పండగ వాతావరణం తెచ్చారని, అధికారంలోకి వస్తే ఆయన కంటే ఎక్కువ పథకాలు ఇస్తామని చెప్పి కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. 14 నెలల పాలనలో ఒక్క హామీ కూడా నెరవేర్చకపోగా.. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశారని ధ్వజమెత్తారు. ముందుగా మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి కె.కె.రాజు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయనకు చిన్నారులు జగన్ పాటను ప్రదర్శిస్తూ డ్యాన్స్‌తో స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి, సీనియర్ నాయకుడు షేక్ బాబ్జి, 48వ వార్డు అధ్యక్షుడు నీలి రవి, తుళ్లి చంద్రశేఖర్ యాదవ్, రామారావు.పాత్రుడు, సంపత్, మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం పోలీసుల అదుపులో దోపిడీ దొంగ

మద్దిపాలెం: దారి దోపిడీకి పాల్పడిన యువకుడిని కంచరపాలెం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు వెస్ట్ సబ్ డివిజన్ క్రైం సీఐ ఎస్.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేసు వివరాలిలా.. అల్లూరి జిల్లా డుంబ్రిగుడ మండలం కింజరి గ్రామానికి చెందిన భగత్‌రాం విశాఖ పోర్టులో కూలీగా పని చేస్తూ కంచరపాలెం కప్పరాడలో నివసిస్తున్నాడు. ఈ నెల 19న సాయంత్రం 5 గంటల సమయంలో విధులు ముగించుకుని, కంచరపాలెం మెట్టు వద్ద ఒక ఏటీఎంలో నగదు డ్రా చేసుకుని ఇంటికి వస్తున్న క్రమంలో సమీప చెరుకురసం బండి వద్ద ఇద్దరు గుర్తు తెలియని యువకులు అతడిని అడ్డుకుని మద్యానికి డబ్బులు డిమాండ్ చేశారు. వారి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో భగత్‌రాం సమీపంలోని గెడ్డలో పడిపోయాడు. డబ్బులు ఇవ్వకపోతే రాయితో దాడిచేసి చంపేస్తామని అతడి వద్ద నుంచి రూ.4 వేలు తీసుకుని నిందితులు పరారయ్యారు. గమనించిన స్థానికులు గెడ్డలో పడి గాయాలైన భగత్‌రాంను పైకి తీసి ఆస్పత్రికి తరలించి, కంచరపాలెం క్రైం పోలీసులకు సమాచారం అందించారు. క్రైం పోలీసులు బృందాలుగా ఏర్పడి సాంకేతిక పరిజ్ఞానంతో దారి దోపిడీకి పాల్పడ్డ తమ్ముడిపాలేనికి చెందిన యువకుడు బంగారి యువరాజుతోపాటు బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. చెడు వ్యసనాలకు అలవాటుపడి సులభంగా డబ్బులు సంపాదించాలనే దురుద్దేశంతో ఒక వ్యక్తిని బెదిరించి డబ్బులు వసూలు చేసినట్టు గుర్తించామని క్రైం పోలీసులు వెల్లడించారు. క్రైం సీఐ ఎస్.శ్రీనివాసరావుతో సహా క్రైం ఎస్ఐ సూర్యనారాయణ, ఏఎస్ రమణ, హెడ్ కానిస్టేబుల్ రెడ్డి, కానిస్టేబుల్ తులసికి నగర పోలీస్ కమిషనర్ శంకబత్ర బాగ్చి అభినందించారని తెలిపారు.

సీతమ్మధార ట్రెజరీలో తప్పుడు బిల్లుల బాగోతం

- ఎస్‌టీవో ప్రమేయం లేకుండా బిల్లులు సిఫారసు చేస్తున్న ట్రెజరీ ఉన్నతాధికారి

మహారాణిపేట: సీతమ్మధార సబ్ ట్రెజరీ కార్యాలయం అక్రమాలకు నిలయంగా మారిందని జోరుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఇక్కడ అనేక కుంభకోణాలు, దొంగ బిల్లుల చెల్లింపు, ఉద్యోగులపై సస్పెన్షన్ వంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. అయినా ఇక్కడి అధికారులు, సిబ్బందిలో ఎలాంటి మార్పు లేదు. ఇప్పుడు ఇదే కార్యాలయం నుంచి తప్పుడు బిల్లుల సిఫారసులు జోరుగా సాగుతున్నాయి. ఈ కార్యాలయంలో సంబంధిత సబ్ ట్రెజరీ అధికారి (ఎస్‌టీవో) ప్రమేయం లేకుండా అనేక బిల్లులకు సిఫార్సులు చేయడం విశేషం. దీర్ఘకాలికంగా సెలవులో ఉన్న జిల్లా ట్రెజరీ అధికారి వై.సుధాకరరావు విధుల్లో చేరిన తర్వాత ప్రీ ఆడిట్ బిల్లుల పరిశీలనలో ఒక బిల్లు నిబంధనలకు విరుద్ధంగా ఉండడంతో దాన్ని వెనక్కి తిప్పి పంపారు. వివరాలు ఇవి.. ప్రభుత్వ కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తున్న జి.ఈశ్వర వర్మ 1994 డిసెంబర్ 31వ తేదీన రిటైర్ అయ్యారు. ఇతను 2015 డిసెంబర్ 27వ తేదీన చనిపోయారు. తర్వాత సర్వీస్ పెన్షన్, ఇతర అరియర్స్, డీఏతో కలుపుకుని మొత్తం రూ.36 లక్షల వస్తాయని లెక్కలు వేశారు. కొన్ని బిల్లుల చెల్లింపునకు అర్హత లేకపోయినా చెల్లించడానికి పెద్ద మొత్తంలో బేరం కుదుర్చుకుని సీతమ్మధార సబ్ ట్రెజరీ కార్యాలయంలో బిల్లులు సిద్ధం చేశారు. సీనియర్ అకౌంటెంట్ ఈ మొత్తం ప్రక్రియను తయారు చేసి సిఫారసు చేశారు. సంబంధిత ఎస్‌టీవోకు ప్రమేయం లేకుండా సంబంధిత కార్యాలయం అసిస్టెంట్ ట్రెజరీ అధికారి సంతకం చేశారు. అప్పటి ఇన్‌చార్జి డీటీవోగా కూడా ఇక్కడ అసిస్టెంట్ ట్రెజరీ అధికారి పని చేశారు. ఇంతలో సెలవు పూర్తి కావడంతో జిల్లా ట్రెజరీ అధికారి (డీటీవో) వై.సుధాకరరావు విధుల్లో చేరారు. అనేక ఆరోపణలు రావడంతో ప్రీ ఆడిట్‌లో బిల్లులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇందులో ఈశ్వర వర్మ ఫ్యామిలీ పెన్షన్ వ్యవహారం బయట పడింది. ఈ బిల్లు అంతా తప్పుల తడకగా ఉన్నట్లు గమనించి బిల్లులను డీటీవో సుధాకరరావు వెనక్కి పంపారు. ఆ ఫ్యామిలీకి లేనిపోని ఆశలు కల్పించి వారితో లాలూచీ పడినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పుడు ఈ బిల్లు వెనక్కి రావడంతో ముందుగా తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని వారు కోరారు. మళ్లీ తాను త్వరలో ఇన్‌చార్జి డీటీవోగా వస్తానని, అప్పుడు పూర్తి చేస్తామని వారికి నమ్మబలుకుతున్నట్టు సమాచారం.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిదిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.